అప్పుడే మరచిపోతే ఎలా!

- ఎమ్మెల్యే అయిన వెంటనే బిటి రోడ్డు వేస్తానని హామీ - వర్షపు నీరు నిల్వ వున్న రోడ్డులో వరినాట్లు వేసిన ఎమ్మెల్యే - నేడు మండలానికి పల్లె పండుగ కార్యక్రమం ఎమ్మెల్యే హాజరు

యాదమరి, అక్టోబర్ 20 ప్రభాతవార్త: ఎన్నికల పండుగ పూర్తయిన వెంటనే అధికారంలోకి వచ్చిన నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీ మరచిపోతారు. ఎన్నికల వరకు ప్రజలపై చూపించే ప్రేమ, అనురాగం ఆపై ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఏ ఒక్కరు చూపించరు. యాదమరి మండల ప్రజలు గత ఐదేళ్ళుగా చిత్తూరు - గుడియాత్తం రోడ్డులో కాశిరాళ్ళ నుండి తమిళనాడు సరిహద్దు వరకు వాహనాల్లో వెళ్ళడానికి నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారిలో బస్సులు సైతం సక్రమంగా వెళ్ళడానికి వీలులేని పరిస్థితి వుంది. ఈ రహదారిలో ఒకొక్క గుంత చాలా లోతుగా వుండటంతో అనునిత్యం ఈ రహదారిలో వాహనదారులు గాయాలు పాలై ఆసుపత్రుల్లో చికిత్స చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకొని ఓట్లు సాధించడానికి ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఈ రోడ్డును బాగా వాడుకున్నారు. ఇలాంటి రోడ్డులో ఎవరైనా ప్రయాణిస్తారా! ఇక్కడ ప్రభుత్వం వుందా! లేదా! ఇక్కడే జడ్పీ వైస్ ఛైర్మన్ వున్నారుగా! ఆయనకు తెలియదా! ప్రజల కష్టాలు అంటూ విమర్శించడంతో పాటు రహదారిలో వర్షపు నీరు బాగా నిల్వ వున్న ప్రాంతం వద్దకు ఒక ట్రాక్టర్‌లో ప్రజలను తీసుకువచ్చి ట్రాక్టర్‌లో రోడ్డును దున్ని ఎమ్మెల్యే అక్కడే వరినాట్లు నాటారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ రోడ్డుకు మోక్షం కల్పిస్తానని, కొత్త రోడ్డు మంజూరు చేసి తాను ఆ రోడ్డులో ప్రజలతో పాటు ప్రయాణిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఎమ్మెల్యే అయి నాలుగు నెలలు పూర్తయ్యింది. రాష్ట్రంలో ఆయన పార్టీకే చెందిన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు సుభిక్షం అవుతుందని ప్రజలు అందరు భావించారు. అయితే ఈ విషయంను ఇప్పటి వరకు మండల పార్టీ నాయకులు ఎవరైనా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారా! ఒకవేళ ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయంను నాయకులు తీసుకెళ్ళి వుంటే ఆయన ప్రజలకు హామీ ఇచ్చిన రోడ్డు నిర్మించానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తారు! ఒకవేళ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ దృష్టికి ఈ రోడ్డు వ్యవహారం వెళ్ళకుంటే ఇప్పటికైనా ఇచ్చిన హామీని గుర్తు చేసుకుని సత్వరం రోడ్డు నిర్మించి పుణ్యం కట్టుకోవాలని మండల ప్రజానీకం ప్రార్థిస్తున్నారు.

రోడ్డుపై వరినాట్లు నాటుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్(ఫైల్‌ఫోటో)

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ : సీడిపిఒ

కోట,అక్టోబర్ 21 ప్రభాతవార్త : మాతా శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకం. చిన్నారులు,బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు అవి ఎంతగానో దోహదం చేస్తుంటాయి. గత ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు. చాలా చోట్ల వాటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో కేంద్రాలకు వచ్చే వారు అత్యవసరమైతే మరుగుదొడ్లు లేక ఆందోళన చెందేవారు. దాహార్తి తీర్చుకునేందుకు గుక్కెడు నీరు లభించక ఇబ్బందులు పడేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై దృష్టి పెట్టింది. జిల్లా వ్యాప్తంగా పక్కా భవనాలున్న కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగు నీటి వసుతలు కల్పినుంది.కోట ప్రాజెక్టు పరిధిలోని 94 చోట్ల తాగునీటి వసతి కల్పనకు తొలి విడతగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు సదపాయాలు కల్పించాల్సిన కేంద్రాలను ఇప్పటికే అధికారులు గుర్తించారు.ఒక్కో మరుగుదొడ్డికి నిర్మాణానికి రూ 36 వేలు చొప్పున అందిచనున్నారు. పనులు పర్యేవేక్షణ భాత్యతను జిల్లా నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) కు అప్పగించారు.ఈ విషయమై ఐసీడీఎస్ కోట ప్రాజెక్టు సిడిపిఒ మునికుమారి మాట్లాడుతూ తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షించి శర వేగంగా పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిసి రోడ్డు పనులకు భూమి పూజ

ఓజిలి, అక్టోబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా ఆదివారం నాడు ఓజిలి మండలం కొండ వల్లిపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పరసా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు పరసా చంద్రశేఖర్ మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి నెలవల సుబ్రమణ్యం సహాయ సహకారాలతో కొండపల్లి పాడు గ్రామంలో అన్ని మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే మా ధ్యేయంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టిడిపి ఇన్చార్జి నెలవల సుబ్రమణ్యం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. గడిచిన ఏ ప్రభుత్వం లోనూ పల్లెల అభివృద్ధి కోసం ఇంత పెద్దఎత్తున ప్రణాళికలు రూపొందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, టిడిపి యువ నాయకులు పరసా చంద్రశేఖర్, బత్తిన వెంకట సుబ్బయ్య శెట్టి, చెంబోబులయ్య, వెంకటేశ్వర్లు, జమళ్ళ ప్రసాద్, కె. వంశీకృష్ణ, కోకొళ్ళ చంద్రశేఖర్, కృష్ణమ్మ, పంచాయితీ కార్యదర్శి వెంకయ్య, బిఎఫ్‌టి పెంచలయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రెండు లక్షలు విరాళం

కాణిపాకం, అక్టోబర్ 20 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేర్వేరుగా రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ కేశాని,కెవి. రమణయ్యలు వేర్వేరుగా నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయల వంతున విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విగ్నేష్, చిట్టిబాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, అక్టోబర్ 20 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ప్రధాన ఆలయంలోని ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక అలంకార మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ దంపతులు, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి,విఘ్నేష్, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

వైష్ణవీదేవీ ఆలయానికి పెరిగిన భక్తుల రద్దీ

చౌడేపల్లి, అక్టోబర్ 20 ప్రభాతవార్త : మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీదేవీ ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయా నికి ఆ ప్రాంతం నుంచి కాకుండా ఇతర ప్రదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తలరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రధానార్చకురాలు శ్రావణి అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఆలయం ప్రాంగణం లోని కాలభైరవ, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు దేవస్థానం నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించాడు.

ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం, రైతుల పాలిట శాపం

పాకాల, అక్టోబర్ 20 ప్రభాతవార్త : పాకాల మండలం మద్దినాయనపల్లి గ్రామంలోని నల్లబండ చెరువు అలియాస్ పాత వడ్డిపల్లి చెరువు కట్టకు గండిపడి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. వర్షాలు పడిన ప్రతి సారి నీరు చెరువులో నీళ్లు నిలవక వృధాగా పోతోంది. గత ప్రభుత్వ పాలకులు రైతుల సంక్షేమం గాలికొదిలి వదిలేయడం వలన వర్షం పడినప్పుడల్లా ఎగువ నుంచి చెరువుకు వచ్చే నీటి ప్రవాహం కట్టకు పడిన గండి ద్వారా వృధాగా పోతుంది. దాదాపు 30 హెక్టార్లలలోని ఆయకట్టుదారులు మూడు సంవత్సరాల నుండి చెరువులో నీరు లేక పోవడం వలన వరి, రాగి, చెరకు, మొక్కజొన్న, టమాటో లాంటి వాణిజ్య పంటలు పండించుకోలేక పోతున్నారు. ఒక బోరు బావుల్లో సైతం నీరు అడుగంటడం వలన మెట్ట రైతులు మామిడి, వేరుశెనగ, కంది, పెసర, మినుములు, అలసంద రైతులు అందరు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తెగిన చెరువు గండిని పరిశీలించి కట్ట మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, రైతులకు సాగు, గ్రామ ప్రజలకు త్రాగునీరు అందించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలో మందుబాబులు చిందులు

పాలసముద్రం, అక్టోబర్ 20 ప్రభాతవార్త: చదువుల తల్లికి నిలయమైన ప్రభుత్వ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో మందు బాబులు పాఠశాలలో చేరి పాఠశాలను బార్‌గా మార్చివేస్తున్నారు. పాలసముద్రం మండలం పాలసముద్రం దళితవాడ ఎంపియుపి ప్రభుత్వ పాఠశాల పరిస్థితి ఇది. ప్రభుత్వం చౌక ధరకే మద్యంను విక్రయిస్తుండటంతో మందుబాబులు తక్కువ ధర మద్యం కొనుగోలు చేసుకుని నేరుగా పాఠశాల చేరుకుని తిష్ట వేస్తున్నారు. రాత్రి 8 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు పాఠశాలలో మందు బాబులు స్వైరవిహారం చేస్తున్నారు. తాగిన మైకంలో పాఠశాల ఆవరణలోనే మందుబాబులు మద్యం బాటిళ్ళు పగలగొట్టడం, పాఠశాల తాగునీటి పైపును ధ్వంసం చేయడం, తాగిన మద్యం సీసాలను ఎక్కడ పడితే అక్కడ వదలి వెళ్ళడం చేస్తున్నారు. పాఠశాలకు వాచ్‌మెన్ లేకపోవడంతో పాఠశాల విద్యార్థులే ప్రతి రోజు పాఠశాలను శుభ్రం చేస్తున్నారని రాత్రి సమయాల్లో మద్యం సీసాలు పగులగొట్టి వెళితే పిల్లలు ఈ సీసాలను ఎలా తీస్తారని తల్లిదండ్రులు ఆక్రోసిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ విషయంపై శ్రద్ధ వహించి పాఠశాలలోకి మద్యం సేవించడానికి ఎవరు రాకుండా కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

108 వాహనాన్ని బాగు చేయరా...!

కేవీబీ పురం, అక్టోబరు 20 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కేవీబీ పురంలో 108 వాహనం ఎంతో ప్రజలకు సౌకర్యంగా ఉండేది. అలాంటిది గత రెండు నెలలుగా మరమ్మతుల కారణంతో వాహనం నడవడం లేదు. అందులో పని చేసే సిబ్బందికి జీతాలు కూడా రాలేదని వారు ఆరోపిస్తున్నారు. మారుమూల లో తట్టు ప్రాంతమైన కేవీబీ పురం మండలానికి ఉన్న 108 వాహనాన్ని వెంటనే బాగు చేసి రోగులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర వైద్య సదుపాయం పొందుటకు ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. ఎంతో మంది గర్భిణీలు మండల కేంద్రమైన కేవీబీ పురం పీహెచ్‌సీకి వస్తున్నారు. అక్కడ అత్యవసరమైతే 108వాహనం లేకపోవడంతో ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని గర్భిణీలు, రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి 108 వాహనాన్ని మరమ్మతులు చేసి పీహెచ్‌సీలో అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

పుత్తూరు వాసికి అరుదైన గౌరవం

విశాఖపట్టణం మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మిపతిరాజు

పుత్తూరురూరల్, అక్టోబరు 20 ప్రభాతవార్త: మండలంలోని కేబీఆర్ పురం పంచాయతీలోని రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన జి.లక్ష్మిపతి రాజును విశాఖపట్టణంలోని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్టణంలో ఆదివారం మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2024-29 వరకు ఐదు సంవత్సరాల పాటు ఉంటుందని ఈ ఎన్నికల అధికారి రాజశేఖర్ అబ్జర్వర్ వికాస్‌ఖరార్ తెలియజేశారు. ప్రధాన కార్యదర్శిగా సైకం రాంప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా జగదీష్, నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, హరిగోపాల్, నాగసుందరం, రమేష్‌కుమార్, ఈసీ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లక్ష్మిపతిరాజు మాట్లాడుతూ వచ్చే ఐదేళ్ళలో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొని ఆరోగ్యమే మహాభాగ్యం అనే స్లోగన్‌తో ముందుకు వెళ్తామన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా క్రీడల్లో పాల్గొంటూ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నటువంటి ఈ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

కోదండరాముల వారికి ముత్యాల హారం వితరణ

చంద్రగిరి, అక్టోబర్ 20 ప్రభాతవార్త: శ్రీకోదండ రాముల వారికి చంద్రగిరికి చెందిన ఎం.లక్ష్మి కుటుంబ సభ్యులు ముత్యాల హారం కానుకగా అందజేశారు. స్థానిక శ్రీకోదండరామాలయంలో సీతారామలక్ష్మణులు ఏకశిలపై వెలసి వైకుంఠవాకిలి కలిగిన అత్యంత పురాతన ఆలయం టిటిడి అనుబంధ పరిధిలోకి రావడంతో నిత్య దూపదీప నైవేద్యాలతో పాటు నిత్య, వార, మాస, వార్షిక సేవలు, ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీసీతారాముల వారిపై తమకు గల అపారమైన భక్తి విశ్వాసాలతో లక్ష్మి కుటుంబ సభ్యులు రూ.28,675/-లు విలువైన 1673.500 గ్రాముల ముత్యాల హారాన్ని ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అరిగెలవారిపల్లిలో వైభవంగా ఆయుధపూజ

చంద్రగిరి, అక్టోబర్ 20 ప్రభాతవార్త: అరిగెలవారి పల్లిలో ఆదివారం ఆయుధపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. పనపాకం పంచాయతీ, అరిగెలవారిపల్లిలో యువకులు గ్రామదేవత సత్యమ్మ గుడి ఎదుట కాళీమాతా చిత్రపటానికి విజయదశమి ఆయుధపూజ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి చెందిన 75 ద్విచక్ర వాహనాలు, ఫోర్‌వీలర్ వాహనాలను ఆలయం వద్దకు చేర్చి ప్రత్యేక పూజలతో ఆయుధపూజ చేశారు. పాతికేళ్ళుగా ఈ సంప్రదాన్ని అనుసరిస్తూ చేస్తున్న ఈ విజయదశమి ఆయుధపూజలో డప్పువాయిధ్యాలు, కోలాట నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఆలయ వద్ద ఎస్వీ జూపార్క్ మాజీ డైరెక్టర్ మణి యాదవ్ అన్నదాన కార్యక్రమంలో భాగంగా 400 మందికి మాంసాహార భోజనాన్ని వితరణ చేశారు. వైస్ ఎంపిపి వెంకటరత్నం, పానేటి చెంగల్రాయులు అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గార్డు కృష్ణయ్య, అరిగిల రామచంద్రయ్య, గేనే సుబ్బయ్య, దళవాయి మునిరత్నం, మునీంద్రబాబు, దేవేంద్ర, శేషాద్రి, కృష్ణయ్య, జగన్నాధం, కోలాట గురువు ఆవుల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ భరత్ కన్పించడం లేదని మాధ్యమాల్లో హల్‌చల్

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త : స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడు, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ కన్పించడం లేదంటూ ఆదివారం కుప్పం నియోజకవర్గ వైఎస్సార్సీపి కార్యకర్తల పేరిట కొంతమంది సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశారు. ఎమ్మెల్సీ భరత్ వయసు 35 అని ఆయన తమకు కన్పించడం లేదని ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని కోరుతూ కనబడుటలేదు అనే ప్రకటన మాదిరి వాట్సప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. కాగా ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం ఎమ్మెల్సీ భరత్ కుప్పంలో పెద్దగా ఉండడం లేదు. కార్యకర్తలు సైతం తమకు అందుబాటులో లేరని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యకర్తలు కొంతమంది ఇలా పోస్టులు పెట్టడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

జూడో ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలు ప్రారంభం

రేణిగుంటలో కబాడీ స్టేడియం: శ్రీకాళహస్తి క్రీడా హబ్

శ్రీకాళహస్తి,అక్టోబర్ 20 ప్రభాతవార్త : గత వైకాపా ప్రభుత్వంలో 'ఆడుకుందాం ఆంధ్రా' పేరిట రూ.450 కోట్లు స్వాహా చేసారని ఆదివారం శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబియస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సారధ్యంలో ఏర్పాటు చేసిన ఇంటర్ జిల్లా జూడో ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలను ప్రారంభించుటకు వచ్చిన శాప్ ఛైర్మెన్ రవికుమార్ ధ్వజమెత్తారు.ఈ పోటీలను ప్రారంభించుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆహ్వానం మేరకు శాప్ ఛైర్మెన్ రవి కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా శాప్ ఛైర్మెన్ రవి కుమార్‌మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మండల స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించుటకు క్రీడలను అభివృద్ధి పరచుటకు శాప్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుందని వివరించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో క్రీడాకారులకు కొదవ లేదని కానీ వారికి తగిన ప్రోత్సహం లేదని శాప్ ఛైర్మెన్ రవి కుమార్ అభిప్రాయపడ్డారు.

రేణిగుంటలో కబాడీ స్టేడియం: శ్రీకాళహస్తి క్రీడా హబ్:

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో క్రీడాకారుల గణనీయంగా ఉన్నారని వారిని ప్రోత్సహించుటకు శ్రీకాళహస్తిని 'క్రీడా హబ్‌గా' తీర్చిదిద్దుటకు చర్యలు తీసుకుం టున్నట్లు శాప్ ఛైర్మెన్ రవికుమార్ వివరించారు.యువనాయకుడైన బొజ్జల సుధీర్‌రెడ్డి తనకు ఎన్నో ప్రతిపాదనలు అందించారని తాను పరిశీలించి నిధులు మంజూరు చేస్తామన్నారు.రేణిగుంటలో 'ఇంటర్నేషనల్ కబాడి స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి ఎంఎల్‌ఏ అభ్యర్థించారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించుటకు ప్రయత్నిస్తామన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళి శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను దేశ వ్యాప్తంగా పెంచాలని కోరారు.జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ సారధ్యంలో జిల్లా స్థాయి జూడో ఛాంపియన్ షిప్ పోటీలను ఆదివారం ప్రారంభించారు.శ్రీకాళహస్తి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాహ్నవి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావటంతో ఆ విద్యార్థిని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సత్కరించారు. అలాగే ఆ విద్యార్థికి ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి అభినందించి రూ.10వేల రూపాయలు వ్యక్తిగతంగా అందించి ప్రోత్సహించారు. రవి మాట్లాడుతూ జాహ్నవి ని ప్రోత్సహించుటకు శాప్ తరఫున సహకారం అందిస్తామన్నారు.రాష్ట్రంలో క్రీడా అభివృద్ధికి శాప్ నిర్మాణాత్మక కృషి చేస్తుందన్నారు. ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని క్రీడాహబ్‌గా తీర్చి దిద్దేలా రాష్ట్ర మంత్రి నారాలోకేష్‌బాబు సహకారంతో రేణిగుంటలో 20 ఎకరాల్లో జాతీయ స్థాయి కబాడి స్టేడియం నిర్మించనున్నట్లు వివరించారు.శ్రీకాళహస్తిలోని విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బూజు పట్టిన స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తున్నట్లు ప్రకటించారు.ప్రతి క్రీడాకారుడు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగి విజయాన్ని చేజిక్కించుకొని శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలన్నారు.

బొల్లినేనికి అభినందన:

శ్రీకాళహస్తిలో క్రీడాకారులను ప్రోత్సహించుటకు ఎందరో నాయకులున్నారని అందులో శ్రీకాళహస్తి మండలానికి చెందిన మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధం నాయుడు కృషి అభినందనీయం అన్నారు. నేడు ఇక్కడ ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పోటీలకు దాతగా జగన్నాధం నాయుడు చేయూత ఇవ్వటం క్రీడాకారులు, క్రీడల పట్ల ఆయనకు గల గుర్తింపు నిదర్శనం అన్నారు. ఆయన క్రీడాకారులకే కాక ఏడాదికి పైగా నిరుపేదలైన కార్మికులకు వందలాదిమంది కి భోజనం అందించిన అన్నదాత అని అభినందించారు.ఈ కార్యక్రమాల్లో శాప్‌ఛైర్మెన్ రవికుమార్, ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి, బొల్లినేని జగన్నాధం నాయుడు, బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్, మార్కెటింగ్ కమిటి మాజీ ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు వివిధ మండలాలకు పిడిలు హాజరయ్యారు.

మరింతగా క్రీడల అభివృద్ధి

-అంతర్జాతీయ హాకీక్రీడాకారిణికి శాప్‌ఛైర్మన్ సన్మానం

తిరుపతి,అక్టోబర్ 20ప్రభాతవార్త: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, క్రీడలకు అవసరమైన నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారం అందిస్తారని రాష్ట్రక్రీడా ప్రాదికారసంస్థ (శాప్)ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పూర్తిసహాయ సహకారాలందిస్తామని అన్నారు. తిరుపతిలో ఆదివారం ఉదయం అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి ఇటిమరపు రజినీ శాప్ ఛైర్మన్ రవినాయుడును తన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసిన ఆమెను రవినాయుడు దుశ్శాలువతో సత్కరించి ఆమె నుండి క్రీడలకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై చర్చించిన అనంతరం సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ

ఆంధ్రప్రదేశ్ అత్యాచారంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

మాజీ మంత్రి రోజా

నగరి, అక్టోబరు 20 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌ని అత్యాచారాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి రోజా ఆరోపించారు. ఆదివారం బద్వేల్‌లో ఉన్మాది దాడిలో యువతి చనిపోయిన ఘటన నేపథ్యంలో ఆమె ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. మీడియాతో బాధితురాలి తల్లి మాట్లాడిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసిన ఆమె రోధిస్తున్న కన్నతల్లి గర్భకోశం మీ చెవులకు వినిపిస్తోందా చంద్రబాబు, అనిత, పవన్ కల్యాణ్ అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆడ బిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కూటమిప్రభుత్వం వరుస మానభంగాలు, హత్యలు జరుగుతున్నా అదుపు చేయక ఆంధ్రప్రదేశ్ అత్యాచారాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందన్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

వేట లేక.. పూట గడవక..!

మత్స్యకారులకు తప్పని ఇబ్బందులు

కోట,అక్టోబర్ 20 ప్రభాతవార్త కడలిని నమ్ముకుంటున్న మత్స్యకారులు బతుకు రోజు రోజుకు భారంగా మారుతోంది. సముద్రంలో ఏర్పడుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చేపలు ధర తగ్గుదల వారి జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి.వేట సాగక పూట గడవక వారు అప్పులు చేసి వారు కుటుంభాలను పోషించు కుంటున్నారు..జిల్లాలోని కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో ప్రతి రోజు మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వేటకు అనుకూలంగా ఉంటే మత్స్య సంపద ఎక్కువ లభిస్తుంది. ఈఏడాది అంతా తుపాన్లు వాయుగుండాలతో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో పూర్తి స్థాయిలో వేట సాగిన పరిస్థితి లేదు. దీంతో గంగపుత్రుల ఆశలు ఆడియాశలయ్యాయి.

మీ ఎమ్మెల్యే ఎంత మంచివారు!

-ఇక ఎంఎల్‌ఏల పనితీరుపై సిఎం చంద్రబాబు నిఘా !
-త్వరలో పంచసభ్యకమిటీ ఏర్పాటు

ప్రభాతవార్త-తిరుపతి: సమాజంలో బాధ్యత గల ప్రజాప్రతినిధిగా,తమను నమ్మిన ఓటర్లకు ఏ మేరకు న్యాయం,సాయం చేస్తున్నారనే అంశాలపై ఆయా నియోజకవర్గాల్లో ఎంఎల్‌ఏల పనితీరును ప్రాదిపదికగా తీసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా పంచసభ్యకమిటీని నియమించే దిశగా ఆలోచన చూశారు.ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగానేగాక తన సొంత చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని సొంత పార్టీ ఎమ్మెల్యేలతోబాటు కూటమి ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా ఉంచి, ప్రజలకు వాళ్ళు చేస్తున్న మంచి, చెడులను పర్యవేక్షించనున్నారు. ఈ కమిటీ ఎంఎల్‌ఏలపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఈ కమిటీ ఏం చెబితే, ఏది చూస్తే దాన్ని నివేదికగా సిఎంకు అందజేస్తుంది. ఆ తరువాత ఆయా ఎంఎల్‌ఏలకు చంద్రబాబు తనదైన శైలిలో దిశానిర్దేశం చేయనున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలపైనేగాక పార్టీలో సీనియర్లు అయిన ఎమ్మెల్యేలపై కూడా ఈ నిఘా ఉంచనున్నారు. చంద్రబాబు తన సొంత జిల్లాలైన చిత్తూరుజిల్లాతోబాటు తిరుపతి జిల్లాపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టించడానికి చొరవచూపుతున్నారనేది పార్టీలో సీనియర్ల మనోగతం. మరీ ఇదే జరిగితే ఇప్పటికే పలురకాల ఆరోపణలు ఉన్న ఎమ్మెల్యేల పనితీరును మార్చుచేసి ప్రజలకు సేవచేయడమే ప్రధాన ఉద్దేశ్యంగా చూడనున్నారు. చిత్తూరుజిల్లాలో చిత్తూరు, పలమనేరు, కుప్పం, పూతలపట్లు, జిడినెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో టిడిపి అధికార ఎమ్మెల్యేలు ఉన్నారు. తిరుపతి జిల్లాలో పుంగనూరు నియోజకవర్గం మినహాయించి తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్ళూరుపేట, సత్యవేడు ,సర్వేపల్లి నియోజకవర్గాల్లోనూ పూర్తిగా టిడిపి అధికార ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. వీరిలో కొందరిపై ఇప్పటికే ప్రజల నుండి, పార్టీకార్యకర్తల నుండి ఫిర్యాదులు అధినేతకు, అధిష్టానంకు చేరాయి. దీనిపై చంద్రబాబుతోబాటు యువనేత,మంత్రి నారాలోకేష్ కూడా సీరియస్‌గానే ఉన్నట్లుపార్టీ వర్గాల సమాచారం. తమపై నమ్మకం ఉంచి, మిమ్మల్ని గెలిపించన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారికి సేవలుచేయాలని, అధికారులతో కలసి సమస్యలు పరిష్కరించాలనేది సిఎం చంద్రబాబు ఆదేశం, ప్రజలకు ఉచితంగా అందాల్సిన సేవలకు కప్పం వసూలుచేస్తే ఎమ్మెల్యేలపై చర్యలు తప్పవనే హెచ్చరికలు జారీచేశారు .దీంతో ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్యేల పనితీరుపై ఐదుమంది కమిటీతో చంద్రబాబు సొంతజిల్లాల్లోని ఎమ్మెల్యేల బాగోతం వెలుగుచూసే వీలుంటుంది. మరీ ఎమ్మెల్యేల పనితీరులో మార్పు కనిపిస్తుందా లేదా అనేది త్వరలో ఏర్పాటయ్యే కమిటీ క్షేత్రస్థాయిలోకి వస్తేగానీ ఉత్కంఠ వీడదు.

ఘనంగా స్వర్ణ రథోత్సవం

కాణిపాకం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో శనివారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకట హర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయం లోని అలంకార మండపంలో ఉదయం 10 గంటలకు సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక సురక్షితం

24 గంటల్లో కాపాడిన పోలీసులు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త

ఈ నెల 19వ తేది సాయంత్రం కనబడకుండా పోయిన బాలికను తిరుపతి ఈస్ట్ సిఐ తన సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి 24 గంటల్లోనే బాలికను సురక్షితంగా కాపాడి తల్లిదం డ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా.. తిరుపతి కొర్లగుంట మారుతి నగర్‌లో నివాసముంటున్న బాలిక తప్పిపోయిందని పోలీస్ కమాండ్ కంట్రోల్‌కి తల్లిదండ్రులు సమాచారమిచ్చారు. కంట్రోల్ రూమ్ ద్వారా సమాచారం అందుకున్న ఈస్ట్ పోలీసు వారు వెంటనే స్పందించి బాలిక తల్లిదండ్రుల ద్వారా వారు ఇచ్చిన సమాచారంతో జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు సూచనలతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గుత్తి, గుంతకల్ మధ్యలో రాయలసీమ ఎక్స్ప్రెస్‌లో ప్రయాణిస్తున్న బాలికను అక్కడి స్థానిక పోలీసులు, స్నేహితుల సహాయంతో ఈస్ట్ సిఐ సూచనల మేరకు గుర్తించి చేరదీసి తిరుపతి పోలీస్ వారికి సమాచారం అందించారు. వెంటనే దగ్గరలో ఉన్న ప్రత్యేక పోలీస్ బృందాలు బాలికను తీసుకువచ్చి సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి 24 గంటల్లో బాలికను అప్పగించినందుకు వారి తల్లిదండ్రులు తిరుపతి పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతులు తెలుపుకున్నారు. కేసును చాకచక్యంగా చేధించిన తిరుపతి ఈస్ట్ పోలీసు వారిని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు అభినందించారు.

కుప్పం చరిత్రలో ద్రవిడ వర్సిటీ మైలురాయిగా నిలవడం ఖాయం

ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

- ఘనంగా 27వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు !!

.ద్రవిడ వర్సిటీ ఆవిర్భావ దినోత్సవం నాడు పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్సీ డా॥ కంచర్ల తదితరులు

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ చరిత్రలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఓ మైలురాయిగా నిలవడం ఖాయమని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం వర్సిటీ 27వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను వర్సిటీలోని వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రవిడ భాషలు, సంస్కృతులను పరిరక్షించాలనే ఉద్దేశంతో దివంగత నందమూరి తారక రామారావు కుప్పంలో ద్రవిడ వర్సిటీ ఏర్పాటుకు చొరవ చూపారన్నారు. ఎన్టీఆర్ సిఎం అయ్యాక పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు గాను 2రూ.లకే కిలోబియ్యం అందించారన్నారు. అలాంటి ఎన్నో పథకాలు ఆయన అమలు చేసి తెలుగుజాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే సిఎం చంద్రబాబునాయుడు నడుస్తూ వర్సిటీ పురోభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. వర్సిటీలో రాజకీయాలు మాట్లాడకూడదని అయితే గత ఐదేళ్ల వైకాపా పాలనలో వర్సిటీలో రాజకీయాలను ప్రోత్సహించారన్నారు. వర్సిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సి ంగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వని దుస్థితిలో ఉంచారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 2.86 కోట్ల వేతనాలు మంజూరు చేసిన విషయం గుర్తు చేశారు. మున్ముందు సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల సహకారంతో వర్సిటీని మరింత అభివృద్ధి దిశలో పయనింపజేసేందుకు తమవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ మానస పుత్రిక ద్రవిడ వర్సిటీని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వర్సిటీ అభివృద్ధికి మేధావులతో చర్చించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ ప్రాచీనులు సమాజంలో జీవించేందుకు తగు నైపుణ్యాలు తెలుసుకునేందుకు విశ్వవిద్యాలయాలు ఏర్పాటుచేసుకున్నారు. విద్యార్థులు ఎలా చదువుకోవాలి, సమాజం పట్ల ఎలా ఉండాలో వర్సిటీ నుంచి నేర్చుకోవాలని సూచించారు. కాగా వర్సిటీ ఏర్పాటై 27 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన గేలరీ అలరించింది.అనంతరం వర్సిటీలో నూతన బ్లాక్ భవనంతో పాటు పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి,ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, హెచ్ఒడి ఆచార్య సంపత్ కుమార్, తెదేపా రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు

పోలీసుల పాత్ర చాలా కీలకం

నేడు నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు పేర్కొన్నారు.ఆదివారం రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారకా తిరుమలరావు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 11 రోజుల పాటు 21వ తేది నుండి 31వ తేది వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమాజ అభ్యున్నతి కోసం పోరాడుతున్నారు. విధి నిర్వహణలో అమరులైన వారందరి యొక్క త్యాగాలను స్మరించుకుంటూ వారి పేర్లను మననం చేసుకోవడం మన బాధ్యతన్నారు. ఈ నెల 21వ తేది సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం, స్మృతి పెరేడ్‌ను పోలీస్ పెరెడ్ మైదానంలో పోలీసు అమరవీరుల స్మారక స్థూపం వద్ద స్మృతి పెరేడ్ ద్వారా ఘనంగా నివాళులు అర్పించి వారి యొక్క పేర్లను మననం చేసుకుని వారి కుటుంబ సభ్యులను సన్మానించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రముఖులు పాల్గొంటారు. అనంతరం 22వ తేది నుండి 30వ తేది వరకు అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించడం, 24వ తేది నుండి 27వ తేది వరకు వ్యాసరచన పోటీలు, బృంద చర్చలు పోటీలు నిర్వహణ, 26వ తేది నుండి 27వ తేది ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్, 28వ తేది మెడికల్ క్యాంప్, రక్తదాన శిభిరాలు, 29వ తేది సెమినార్లు, ఉపన్యాసాలు, 30వ తేది పోలీస్ అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుని ప్రత్యేక విజయాలు సాధించిన వారి సోదరీ సోదరులను సన్మానించడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్పి వెంకటరావు పరిపాలన,ఎస్పి డిఎస్‌పి గిరిధర్ పాల్గొన్నారు.

లద్దిగం చెరువులో

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న రైతులు

ఆయకట్టును ఎడారిగా మార్చద్దన్న గ్రామస్తులు
తవ్వకాలకు అనుమతి లేదంటున్న అధికారులు

లద్దిగం(చౌడేపల్లి), అక్టోబర్ 20 ప్రభాతవార్త వందలాది ఎకరాల సాగుభూమి వేలాది మంది రైతుల జీవితాలు ఆ చెరువుపై ఆధారపడివుంది. అయితే కొందరు చెరువులోని ఇసుకను తవ్వేస్తుండటంతో రైతులు వెళ్ళి మిషనరీని అడ్డుకొన్నారు... ఆయకట్టు రైతుల కథనం మేరకు...మండంలోని పంచాయతీ కేంద్రం లద్దిగం పెద్దచెరువు వుంది. ఈ చెరువు దాదాపు 720ఎకరాలు విస్తరించి చౌడే పల్లి, పుంగనూరు మండలాలకు చెందిన లద్దిగం, బండ్లపల్లి, అంకుతోటపల్లి, ఏతూరు, కొత్తపల్లి, పుదిపట్ల, తిరుమణిపల్లి, నల్లూరుపల్లి తదితర గ్రామాలకు చెందిన వేలాదిమంది రైతులు లద్దిగం పెద్దచెరువుపై ఆధారపడి జీవిస్తున్నారని లద్దిగం రాజశేఖర్‌రెడ్డి అనే రైతు తెలిపాడు. చెరువులోకి అక్రమంగా చొరబడి పెద్దపెద్ద మిషన్లద్వారా తోడేస్తున్నారనీ, దాదాపు 5ఎకరాల్లో రీచ్‌లు ఏర్పాటు చేసుకొని తెల్లబంగారాన్ని తరలిస్తున్నారన్నారు. ఇలా అయితే భూగర్భ జలాలు ఇంకిపోయి చుట్టుపక్కలున్న బోర్లు, బావులు ఎండిపోతాయన్నారు. ప్రభుత్వఅధికారులు చొరవతీసుకొని తవ్వకాలను నిలిపివేసి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు.

అనుమతులు లేవు : తహశీల్దార్ హనుమంత్ నాయక్

లద్దిగం పెద్దచెరువులో ఇసుకను తవ్వడానికి ఎలాంటి అనుమతులు లేవని తహశీల్దార్ హనుమంత్ నాయక్ తెలిపారు. సమస్య తమ దృష్టికి వచ్చిందనీ, విచారణ జరిపి చర్యలు తీసుకొంటామని వివరణ ఇచ్చారు. ఇప్పటికే ఇరిగేషన్, మైనింగ్ అధికారులకు సమాచారమిచ్చామన్నారు.

వైసీపి అక్రమ కట్టడాలను

కూల్చటానికి 'హైడ్రా' తెస్తాం

బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,అక్టోబర్ 20 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలో గత ప్రభుత్వ హాయాంలో జరిగిన అక్రమ కట్ట డాలను చట్టపరిధిలో తొలగించుటకు వెనుకాడమని హైదరాబా దులో హైడ్రా తరహా చట్టాన్ని శ్రీకాళహస్తిలో అమలు చేసి భరతం పడతామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైకాపా హయాంలో కొందరు అధికార పార్టీ నాయకుని అండదండలతో అరాచకాలు సృష్టించారన్నారు.అలాగే ప్రభుత్వ భూములను స్వాహా చేసారన్నారు. రాజీవ్‌నగర్‌లో విచ్చల విడిగా వందలాది నిరుపేదల ప్లాట్లను అధికార ముసుగులో మరో నిరుపేదలకు అప్పగించి పబ్బం గడుపుకొని తమ జేబులు నింపుకున్నారని ధ్వజమెత్తారు.అందరి జాతకాలు తన వద్ద ఉన్నాయి ఎవ్వరిని వదలిపెట్టేది లేదన్నారు. ఒక్కొక్క సోమవారం ఒక్కొక్క మండలంలో యువ నాయకుడు నారాలోకేష్‌ను ఆదర్శంగా తీసుకొని 'ప్రజా దర్బార్‌లను' నిర్వహించుటకు ప్రణాళికలు రూపొందించామన్నారు. దీని ద్వారా ప్రజల వద్దకే పాలన ఉంటుందన్నారు.

ఆధార్‌కార్డుతో టోకెన్ ఇఓ నిర్ణయం:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వివాదాస్పదంగా మారిన ఆధార్‌కార్డుతో పాటు పిఆర్ఓ టోకెన్ విధానం ఆలయ ఇఓ తీసుకున్న నిర్ణయం అని ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ అంశానికి సంబంధించి ప్రజల్లో చోటు చేసుకున్న అసంతృప్తిని గుర్తించి తాను ఇఓ చంద్రశేఖర్‌ఆజాద్‌తో చర్చించామన్నారు. స్థానికులకు ఎలాంటి టోకెన్లు అవసరం లేదన్నారు. కాగా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, వారి అనుచరులు సాగించిన భూకుంభకోణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.సోమవారం మొదటిసారిగా తొట్టంబేడు మండలంతో ప్రజా దర్బార్‌కు శ్రీకారంచుడుతున్నట్లు వివరించారు.ఆయనతో పాటు బిజెపి నాయకుడు కోలా ఆనంద్ కుమార్, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేలపట్టులో విదేశీ విహంగాల సందడి

రెక్కలచప్పళ్లకు తోడైన జనతాకిడి

దొరవారిసత్రం, అక్టోబర్ 20, ప్రభాతవార్త ఆసియా ఖండంలోనే పేరుగాంచిన నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రంలో విదేశీ విహంగాల సందడి మొదలైంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పక్షులు కేంద్రానికి రాలేదు. అయితే గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కిలకిలరావాల సందడి నేలపట్టులో మొదలైంది. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో విదేశీ, స్వదేశీ పక్షులతో కేంద్రం కళకళలాడుతుంది. ఈ పక్షుల శబ్దాలకు పర్యాటకుల సందడి తోడు కావడంతో నేలపట్టు కేంద్రం జనతాకిడితో శబ్దాల మధ్య నడుస్తుంది. నేలపట్టు కేంద్రంలో ఇప్పటికే ఊడబాతులు, తెల్లకంకణాయిలు, నత్తగులకొంగలు, నీటి కాకులు, చుక్కమూతి బాతులు, బుట్టకోడ్లు, తదితర విదేశీ, స్వదేశీ విహంగాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శ్రీలంక, బర్మ, నేపాల్,బంగ్లాదేశ్ ప్రాంతాలనుండి ఈకేంద్రానికి వలసవస్తాయి.

- పైలేట్ పక్షులు వచ్చాకే...

ముందుగానే నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రానికి విహంగాలకు ముందు వివిధ ప్రాంతాల నుండి పైలేట్ పక్షులు ఈ కేంద్రానికి వచ్చి ఇక్కడ స్థితిగతులను పరిశీలిస్తాయి. ఈ పైలేట్ పక్షులు నేలపట్టు, శ్రీహరికోట సమీపంలోని పులికాట్ సరస్సులను పరిశీలించి ఆపై విదేశీ విహంగాలకు సమాచారం అందించడంతో విదేశీ పక్షులు ఈ కేంద్రానికి వచ్చి విడిది చేస్తాయి.

- జతకట్టి ఆ పై పిల్లలను పెంచి...

వివిధ దేశాల నుంచి ఎన్నో వేల కిలోమీటర్ల గాలిలో ఎగురుకుంటూ ఈ కేంద్రానికి వలసోస్తాయి. ఈ నేలపట్టు కేంద్రంలోని చెరువులో వున్న కడప చెట్లపై గూళ్లు నిర్మించుకొని ఓ పక్షి మరో పక్షి జతకట్టి గుడ్లను పెట్టి ఆపై పిల్లలను చేస్తాయి. సుమారు ఆరు నెలల పాటు ఈ నేలపట్టు కేంద్రంలో ఈ పక్షులు ఉండి పిల్లలను చేసుకుని ఆపై తిరిగి మళ్ళీ ఆయా దేశాలకు వెళ్లిపోవడం ఈ పక్షుల ఆనవాయితీ. అక్టోబర్ మాసం నుండి ఏప్రిల్ వరకు తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో ప్రతిరోజు వందలాది మంది పక్షి ప్రేమికులు ఈ కేంద్రానికి వచ్చి విదేశీ, స్వదే శీ విహంగాలను దగ్గరగా వీక్షిస్తారు. ఈ కేంద్రానికి చుట్టు పక్కల గ్రామాల్లోని పక్షి ప్రేమికులే కాకుండా పక్క జిల్లాలు, రాష్ట్రాలే కాకుండా విదేశీలు కూడా ఈ పక్షులను వీక్షించడం ఆపై పక్షులపై పరిశోధనలు చేస్తుంటారు. విహంగాలు జత కడుతున్న సన్నివేశాలు ఎందరో పక్షి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. దీనికి తోడు ఇక్కడ ఉన్న జింకల పార్కు, ఈసి కేంద్రం, పిల్లల పార్కు తదితర ప్రాంతాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

- ఈ సారైనా పండగ చేస్తారా...

తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతిసారి పక్షుల పండగ ఘనంగా ఏర్పాటు చేసేవారు. కానీ గత కొంత కాలం నుండి పక్షుల పండుగను ఏర్పాటు చేయడం లేదని పక్షి ప్రేమికులు విమర్శిస్తున్నారు. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వమే వచ్చింది. మళ్లీ పక్షులను గుర్తించి ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తారా? చేయరా? అని పలువురు అంటున్నారు.

పల్లెల అభివృద్ధి కోసమే పల్లె పండుగ

గుడిపాల, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

పల్లెల అభివృద్ధి కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదివారం మండల పరిధిలోని కొత్తకోట, 197 రామాపురం, నంగమంగళం, పానాటూరు, కిలారిపల్లి, బసవపల్లి తదితర గ్రామాల్లో 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్లు, బిటి రోడ్లు, స్మశానానికి ప్రహరిగోడల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు రాష్ట్రానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గుడిపాల మండలానికి 250 క్యాటల్ ఫామ్‌లు మంజూరు అయ్యాయని, పాడి రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాలు సైతం పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేయడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, సీనియర్ నాయకులు బాలాజీనాయుడు, తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ శివరాజన్, నాయకులు సుమతి మురళీ, హేమాద్రినాయుడు, హరిప్రసాద్‌చౌదరి, శంకర్‌చౌదరి, పికె శంకర్, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పల్లెల్లో ప్రగతి

– ఎమ్మెల్యే డాక్టర్ విఎన్ థామస్

పాలసముద్రం, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని కూటమి సారధ్యంలోని ప్రభుత్వంతోనే పల్లెలు ప్రగతి బాట పడ్తున్నాయని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎన్ థామస్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణజిమ్మాపురం, కనికాపురం, వీర్లగుడి గ్రామాల్లో ఆదివారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ విఎన్ థామస్ పాల్గొని పలు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక గ్రామాల్లో నూతన వెలుగులు సంతరించుకున్నాయన్నారు. మండల పరిధిలో రూ.3.89 కోట్ల ఉపాధి నిధులతో సిసిరోడ్లు, గోకులాలు నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. గత ప్రభుత్వంలో పల్లెలు అభివృద్ధికి నోచుకోక పోగా రాష్ట్రం అభివృద్ధిలో పదేళ్ళు వెనుబడిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఒకే రోజు గ్రామ సభ నిర్వహించి 13 వేల తీర్మానాలు ఆమోదించి రికార్డు సృష్టించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ డాక్టర్ యుగంధర్‌పొన్నా, సర్పంచ్ భానుప్రియ తంగరాజు, తహసిల్దారు అరుణకుమారి, ఎంపిడిఓ విద్యావతి, ఎపిఓ మార్గరేట్, మండల సర్వేయర్ గణేష్, వ్యవసాయ అధికారి ఫిల్లీప్రసాద్, ఇఓఆర్డీ రమేష్‌బాబు, ఎస్ఐ బారతి, జిల్లా దేశం పార్లమెంటు కార్యదర్శి వాసునాయుడు, మాజీ ఎంపిపి ఇందిరమ్మ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గండయ్య, ప్రధాన కార్యదర్శి అరుళ్‌నాథన్, పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబశివన్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

.శ్రీకాళహస్తి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా నూతనంగా ఎన్నుకోబడిన తిరుకాల వెంకటమునిబాబుగౌడ్‌ను శ్రీకాళహస్తి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు అంతటి బాబుగౌడ్ దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, మోహన్‌గౌడ్, దొరబాబుగౌడ్, మునిశేఖర్‌గౌడ్, కోసుర్‌దొరబాబుగౌడ్, ధనంజయరెడ్డి, చిట్టెం వంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిజెపి పతాకావిష్కరణ కార్యక్రమం

రామకుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండలంలోని మొద్దులవంక గ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మైందల రామచంద్రుడు, బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారథి తదిత రులు పతాకావిష్కరణ చేశార. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను నేతలు ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్, సీనియర్ నేతలు రాజసింహ, గంగాచారి, జనసేన నేతలు నరేష్, హరీష్, వెంకటేష్, అమరనాథరెడ్డి, లోకేష్‌రెడ్డి, హరీష్, నాగేష్ పాల్గొన్నారు.

నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ

రామకుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండలంలోని కెంచనబళ్ల గ్రామంలో ఆదివారం నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు తెదేపా నేతలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం సిసి రోడ్లు, గోకులం షెడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేతలు మునస్వామి, పట్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నరసింహులు, శ్రీనివాసులురెడ్డి, రామూర్తి, చిన్నికృష్ణ, రఫీ, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజు, సుబ్రి, విశ్వనాథ్, సత్తి, నాగరాజు, మురళి పాల్గొన్నారు.

నేటి పోలీసు స్పందన రద్దు

చిత్తూరు, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో జిల్లా పాత పోలీసు కార్యాలయంలో జరిగే పోలీస్ స్పందన ఈ వారం రద్దు అయ్యింది. ఎస్పీ మణికంఠ చందోలు మంగళవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నారు. ప్రజలు ఎవ్వరు సమస్యలపై అర్జీలు తీసుకుని సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయానికి రావద్దని, మంగళవారం వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు.

పారిశ్రామిక హబ్‌గా జిడినెల్లూరు

– ఎమ్మెల్యే డాక్టర్ విఎన్ థామస్

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

జిడినెల్లూరు నియోజకవర్గానికి కొత్తగా ఫ్యాక్టరీలు తీసుకువచ్చి నియోజక వర్గంను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేసి ఇచ్చిన హామీని నిల బెట్టుకుంటానని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎన్.థామస్ అన్నారు. కొత్త పల్లిమిట్ట 49 కొత్తపల్లి మిట్ట, ఎస్ఆర్ పురం గుండాలమిట్ట గ్రామాల్లో ఆది వారం ఎమ్మెల్యే డాక్టర్ విఎన్ థామస్ పల్లె పండుగ కార్యక్రమంకు హాజరైన నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి దూరంగా వున్న పలు గ్రామాల్లో రహదారి సదుపాయం కల్పించడానికి, మౌళిక వసతులు కల్పనకు తెలుగుదేశం ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఢిల్లయ్య, మండల టిడిపి అధ్యక్షులు గంథమనేని జయశంకర్‌నాయుడు, నాయకులు గిరినాయుడు, గురునాథం, జీవన్‌కుమార్, దాసరి సతీష్, మోహన్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, ఎంపిడిఓ మోహన్‌మురళీ, తహసిల్దారు లోకనాథపిళ్ళై, ఎపిఓ చంద్రశేఖర్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

కూటమి ప్రభుత్వంతో " పల్లెకు పండుగ " వచ్చింది : గువ్వల

చౌడేపల్లి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంతో పల్లెల్లో పండుగ వాతావరణం వచ్చిందని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజులన్నారు. మండలంలోనిపెద్దూరు, చారాల, శింగిరి గుంట, పరికిదొన, తెల్లనీళ్ళపల్లిల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని సామా జిక అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు చేసారు. ఎన్డీయే కూటమి తేదేపా నాయకులు పూల చంద్రమౌళి, ఆవుల రామచంద్రయ్య, శ్రీధర్‌రాజు(గిరి), బాబునాయుడు, విజయ భాస్కర్‌రెడ్డి, జంపాల శ్రీనివాసులు, కుమార్‌రెడ్డి, మునివెంకటప్ప, తహశీల్దార్ హనుమంత్ నాయక్, ఎంపిడిఓ లీలా మాధవి, ఇఓఆర్‌డీ కృష్ణవేణి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

సదుం, అక్టోబరు 20 ప్రభాతవార్త :

ఈనెల 12 మండలంలోని ఊటుపల్లి పంచాయతీ మద్దెలవారిపల్లి పల్లం సురేంద్రపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన తుమ్మగుంటపల్లి గంగాధర్ కుటుంబ సభ్యులపై 307 హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మాలమహానాడు ఉమ్మడి చిత్తూరుజిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్ఐ షేక్ షావలీకు వినతిపత్రం అందచేశారు. ఎస్సీ ఎస్టీ కేసుపై డిఎస్పీ విచారణ అనంతరం సాక్షులను బెదిరిస్తూ, రాజకీయ వత్తిళ్ళతో కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఎటువంటి ప్రలోభాలకు లొంగక దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుబ్బాశ్రీకాంత్, మాలమహానాడు అన్నమయ్యజిల్లా ఉపాధ్యక్షుడు జె.మల్లికార్జున,రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుభాష్,మండలకార్యదర్శి గుర్రం లోకనాథం,తదితరులు పాల్గొన్నారు.

నేడు కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

– కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం రూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ స్థాయిలో సోమవారం కుప్పం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ప్రజలనుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు పెద్దపీట

శాంతిపురం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు పెద్ద పీట వేస్తున్నారని మండల తెదేపా నేతలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలో పల్లె పండగ కార్యక్రమాన్నిశాంతిపురం, మఠం, ఎంకెపురం గ్రామాల్లో చేపట్టారు. నూతనంగా సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో మండల టిడి పి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచులు జనార్ధనరెడ్డి, ఎవి జయరాం, మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్, నేతలు చలపతి, ఉయ్యాల జయరాంరెడ్డి, నాగరాజు, బాలు, రమేష్, ఎంపిడిఒ పిఆర్‌కుమార్, ఎపిఒ హరినాథ్, కార్యదర్శి అశ్వత్ నారాయణ పాల్గొన్నారు.

నేటినుంచి అత్యవసర వేళల్లో విద్యుత్ అంతరాయం

– రెస్కో ఎండి సోమశేఖర్

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మహదేవ మంగళం నుంచి పలమనేరు వరకు ఉన్న 220కెవి విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా ఈనెల 21-23 తేదీల్లో అత్యవసర వేళల్లో ఉదయం 6గంటలనుంచి సాయంత్రం 6గంటలలోపల విద్యుత్ అంతరాయం ఉంటుందని కుప్పం రెస్కో ఎండి సోమశేఖర్ తెలిపారు. కుప్పం, శాంతిపురం, వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు మండలాల్లో అత్యవసర వేళ అంతరాయం ఉంటుందని లేకుంటే అంతరాయం ఉండదని తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

పల్లెపండుగతో గ్రామాలకు మహర్దశ

చిట్టమూరు, అక్టోబర్ 20 ప్రభాతవార్త

పల్లెపండుగ గ్రామాలకు మహర్దశ తెచ్చిందని తెలుగుదేశం పార్టీ నాయకులు పోలయ్య, రషీద్‌సాహెబ్‌లు అన్నారు. చిట్టమూరు మండలం కోగిలి గ్రామ పంచాయతీ పరిధిలో గల వడ్డికండ్రిగ, గొల్లపాలెం గ్రామాల్లో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు చిట్టమూరు మండల టిడిపి అధ్యక్షులు గణపర్తి కిషోర్‌నాయుడు సూచనల మేరకు సిమెంటు రోడ్లు వేసేందుకు టిడిపి నాయకులు కమతం పోలయ్య, రషీద్ సాహెబ్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్ కమతం చెంగయ్యల ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమతం పోలయ్య, రషీద్ సాహెబ్‌లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి కోగిలి గ్రామ పంచాయతీలో పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు లేక బాధపడుతున్నారని తెలిపారు. ఈ తరుణంలో ఎన్ఆర్ఇజిసి నిధులతో కూటమి ప్రభుత్వం పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకొచ్చి సిమెంటు రోడ్లు ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతంలో ఇదే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా వేసిన రోడ్లు తప్ప వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోగిలి మాజీ ఎంపిటిసి ముజ్మీల్, ఎంబేటి పోలయ్య, అంకయ్య, యనమల చెంచయ్య, మురళి, నెలవల రమణయ్య, మస్తాన్ ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చి

7 బైకులు స్వాదీనం

కోట,అక్టోబర్ 20 ప్రభాతవార్త

కోట మండలం గూడలి పంచాయతీలోని ప్రకాశం కాల నీ ఆదివారం తెల్లవారిజామున కోట,వాకాడు, చిట్ట మూరు మండలాల పోలీసులు కార్డన్ సెర్చి నిర్వహిం చారు. ఒక్క సారిగా పోలీసులు బైకులు రావడంతో, పాటు బూట్లు చప్పుళ్లు, వినబడటంతో కాలనీ వాసులుకు కొద్ది సేపు ఏమి అర్థం కాలేదు.రాత్రి ఏమైనా కాలనీలో దోంగలు పడ్డారు ?. ఇంకామైన దారణం జరిగిందోనని అప్పుడు నిద్ర మత్తులో నుంచి తేరుకోని ఆలోచనలో పడ్డారు. ఇంతలో పోలీసులు కాలనీ మ్తొతం జల్లెడ పట్టారు. ప్రతి ఇంట్లోకి జోరబడి గాలించారు. ఏవరు ఏవరు కొత్త వ్యక్తులు ఉన్నారా? అనే ఆరా తీశారు. గుర్తు తెలియని వారు ఏవరైనా కాలనీలో తల దాచుకోంటున్నారా అని శోధించారు.7 బైకులును, ఒక ఆటోను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్.ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ కాలనీలోకి ఎవరైనా అనుమానితులు, కానీ గుర్తు తెలియనివారు కాని వస్తే వెంటనే పోలీసులకుసమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్డన్ సెర్చిలో వాకాడు ఎస్.ఐ నాగబాబు,చిట్టమూరు ఎస్.ఐ బలరామయ్య, ఎ.ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళ పోలీసులు, పాల్గొన్నారు.

రైతన్నకు రాయితీపై పరికరాలు

కోట,అక్టోబర్ 20 ప్రభాతవార్త

రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్దం చేసింది. జిల్లా పరిధిలోని యంత్ర పరికరాలు ఏ మేరకు అవసరమవుతాయో పరిశీలించి ప్రతిపాదనలు పంపారు.వాటిని రాయితీపై అందజేసేందుకు కార్యాచరణ స్దిదం చేశారు. సాగుకు అవసరమయ్యే యంత్ర పరికరాలు అందుబాటులో లేక ప్రభుత్వం రాయితీపై అందించక జిల్లాలో రైతులు అయిదేళ్లపాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలోనూ తెదేపా ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే యంత్ర పరికరాలను రాయితీపై సమకూర్చింది. ఈ విధానానికి వైకాపా ప్రభుత్వం మంగళం పాడేసింది. ఆర్‌బీకేల పరిధిలో గ్రూపులు ఏర్పాటైన వారికి మాత్రమే యంత్రాలను ఇచ్చి వారి వద్ద నుంచి మిగిలిన రైతులు అద్దెకు తీసుకోవాల్సి వచ్చింది. బ్యాటరీ స్ప్రేయర్లు, అయిల్ ఇంజన్లు, తదితర చిన్న చిన్న వాటిని ఏకంగా ఎత్తేశారు. వీటిని మార్కెట్లో కొనుగోలు చేయలేక.. బాడుగా చెల్లించలేక రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం రైతుకు అండగా ఉండేందుకు చర్యలు చేపట్టింది. మండలాల వారీగా ఏయే యంత్రాలు ఏమేరకు వసరమో వివరాలు సేకరించింది. దీని ప్రకారం 19 రకాల యంత్ర పరికరాలు అవసరమవుతాయని గుర్తించారు. కల్టివేటర్లు, బండ్ ఫార్మర్, ఎంజీ పార్మర్, ప్యాడీ త్రీసర్, ప్లాటేలర్, పవర్ వీడర్ బ్రష్ కట్టర్, డిస్క్ ప్లో, మొక్కజోన్న షెల్లర్స్, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్లు, రొటేటర్లు, ట్రాన్స్ ప్లాంటర్, హార్వెస్టర్లు, టార్పాలిన్లు, పవర్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, అర్హులైన అందరికి ఇచ్చేందకు చర్యలు తీసుకునున్నారు.

ఇద్దరు గంజాయి స్మగ్లర్ అరెస్ట్

సిఐ వెంకటరమణ

వెంకటగిరి, అక్టోబర్ 20, ప్రభాతవార్త

గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న కెఎస్ ఫసల్, కె ఉన్ని కృష్ణ ఉదయంలను అరెస్టు చేసి ఇరవై ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ వెంకటరమణ తెలిపారు. వెంకటగిరి సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ సుబ్బారావుతో కలిసి సిఐ విలేకరుల సమావేశం నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 2 లక్షల 36 వేల రూపాయిలు ఉంటుందని తెలిపారు. గంజాయి స్మగ్లర్సు వెంకటగిరి రైల్వే స్టేషన్ వద్ద ఉండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ఉండగా పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు కేరళకు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. గంజాయి స్మగ్లర్‌పై గట్టి నిఘా పెట్టామని తెలిపారు. గంజాయి స్మగ్లింగ్ చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కౌన్సిలర్ శేఖర్‌పై చర్య తీసుకోవాలని ఎమ్మెల్యేకి ఫిర్యాదు

వెంకటగిరి, అక్టోబర్ 20, ప్రభాతవార్త

సచివాలయ ఉద్యోగి సాయికుమార్ పై దాడి చేసిన ఐదవ వార్డు కౌన్సిలర్ లారీ శేఖర్ పై చర్యల తీసుకో వాలని ఉద్యోగ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణారెడ్డి పలువురు నాయకులు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వారి డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఉద్యోగులు పట్ల చిన్నచూపు చూసేవాడని తెలిపారు. సిపిఐ నాయకుడు చంగయ్య కూడా కౌన్సిలర్ పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై దాడిచేయడంహేయమైన చర్యని తెలిపారు. కౌన్సిలర్‌నుఅరెస్ట్‌చేయకపోతేఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పెన్నక్క చెరువుకు జలకళ

కోట, అక్టోబర్ 20 ప్రభాతవార్త

ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడురోజులు పాటు భారీ వర్షాలు కురిశాయి. ఎగువ ప్రాంతంలో వర్షపు నీరు చేరడంతో అధికారులు వాకాడు స్వర్ణముఖి బ్యారేజికి నీటిని విడుదల చేశారు. ఆ క్రమంలో గూడలి వద్ద స్వర్ణముఖి నది నుంచి నెల్లూరుపల్లి కొత్తపాలెంలోని పెన్నక్క చెరువుకు నీటిని మళ్లించారు. గత రెండురోజుల నుంచి ఈ నీటి ప్రవాహం పెన్నక్క చెరువుకు చేరడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఆయకట్టు పరిధిలోని 13 గ్రామాల రైతులు పంటలు పండించుకుంటారు. ఆ మేరకు రైతులు దుక్కులు దున్ని సాగుకు సిద్ధమవుతున్నారు.

సమగ్రంగా అధ్యయనం చేసి కోటకు నీళ్లివ్వండి

కోట, అక్టోబర్ 20 ప్రభాతవార్త

నీటిపారుదల శాఖ ఇంజినీర్లు కోట మండలంలోని చెరువులపై సమగ్రంగా అధ్యయనం చేసి నీటిని ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నెల్లూరుపల్లి కొత్తపాలెంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ నేదురుమల్లి ప్రసేన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ నీటిపారుదల శాఖ ఇంజినీర్లు నీటిని విడుదల చేయడంలో వాకాడు మండలానికే ప్రాధాన్యత ఇస్తూ కోట మండలానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తాను ఎమ్మెల్యేతో మాట్లాడి జిల్లా కలెక్టర్‌కు వివరిస్తానని తెలిపారు. విద్యానగర్‌లోని చల్లాకాలువ వద్ద గోడను ఎత్తు పెంచినందువలన నీటి ప్రవాహమంతా వాకాడు వద్ద స్వర్ణముఖి బ్యారేజికి వెళుతుంది. దీంతో కోట మండలంలోని రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కోట మండలం కోట, తిమ్మానాయుడుపాలెం, కొక్కుపాడు, జరుగుమల్లి, చిన్న వంజివాక, పెద్ద వంజివాక గ్రామాల్లోని చెరువులకు నీళ్లు ప్రవహించాల్సి ఉంది. ఇంజనీరింగ్ అధికారులు వాకాడు మండలానికి ఎక్కువగా నీళ్లు మళ్లిస్తున్నారని చెప్పారు. నెల్లూరుపల్లి కొత్తపాలెంలో పెన్నక్క చెరువు ద్వారా 13 గ్రామాల రైతులు పంటలు పండించుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. కోట మండలంలోని చెరువులు, కాలువలపై ముందుగా ఇంజినీర్లు సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆయన కోరారు.

సూళ్లూరుపేటలో 444వ నేత్రదానం

సూళ్లూరుపేట, అక్టోబర్ 20 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలోని గమండ్లవీధిలో నివసిస్తున్న కర్లపూడి సాత్విక్‌దత్తా (7) మృతిచెందడంతో బాలుని తల్లిదండ్రుల అంగీకారంతో కార్నియాలు సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే అశువులుబాసిన సాత్విక్‌దత్తా మృతికి సంతాపం తెలిపారు. దీంతో భరద్వాజ సేవాసంస్థ ద్వారా 444 నేత్రదానాలు అందాయి.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

సూళ్లూరుపేట, అక్టోబర్ 20 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు తమ ఆధార్‌కార్డులు, విద్యార్హతకు సంబంధించిన ధ

తిరుపతి డివిజన్

ఒకేలైన్‌లో వాహనాలు రావడం వల్లే ప్రమాదాలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

ఒకే లైన్‌లో వాహనాలురావడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్టీవో దామోదర్‌నాయుడు తెలిపారు. శనివారం తెల్లవారుజామున పుష్పిత్‌స్టీల్స్ ఫ్యాక్టరీ సమీపంలో హైవేపై రెండు ఆల్ ఇండియా టూరిస్టు బస్సులు ఎదురెదురుగా డీకొనగా ఈ ప్రమాద స్థలాన్ని శ్రీకాళహస్తి ఎంవిఐ దామోదర నాయుడు స్వయంగా పరిశీలించి ప్రమాదానికి కారణాలను గుర్తించారు. ఒకేలైన్‌లో రెండు వాహనాలు ఎదురెదురుగారావడం వల్లనే ప్రమాదం జరిగిందని అయితే ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రాత్రిపూట అన్ని వాహనాలను వీలైనంతవరకు రెండు వైపులా పంపాలని పగలు మాత్రమే పనులు చేస్తున్న కారణంగా ఎదురెదురుగా పంపాలని మెగా కంపెనీ నిర్వాహకులకు సూచించారు. ప్రమాదస్థలాన్ని ఆర్టీసి డిపో మేనేజర్ బాలాజీ పరిశీలించారు.

తెదేపా సీనియర్ నాయకుడి మృతి భాదాకరం

.తొట్టంబేడు, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండలంలోని ఇలగనూరు గ్రామానికి చెందిన టిసి నాయకుడు సుబ్రమణ్యం అనారోగ్యంతో ఆకస్మాత్తుగా మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతి నాయుడులు వారి కుటుంబసభ్యులకు చరవాణిద్వారా సంతాపం తెలిపారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు మాట్లాడుతూ పార్టీకి ఎంతో సేవచేసిన ఆయన మృతిభాదాకరం అన్నారు. అనంతరం ఆయన సేవలను కొనియాడుతూ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి పుల్లూరు సుబ్బరామయ్య, మాజీ సర్పంచ్ మధునాయుడు తదితర నాయకులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

టపాకాయల గోడౌన్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలి

.తొట్టంబేడు, అక్టోబర్ 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి-చెన్నై రోడ్లలో ఉన్న టపాకాయల గోడౌన్లను తొట్టంబేడు తహశీల్దార్ యు.మధుసూధ నరావు పరిశీలించారు. ఈమార్గంలో నాలుగు గోడౌన్లు ఉన్నాయి. వీటన్నింటిని పరిశీలించిన ఆయన వాటికి లైసెన్సులు ఉన్నాయా లేవా అని గుర్తించి యజమానుల వివరాలును సేకరించి వారి పోన్‌నంబర్లను నమోదు చేసుకున్నారు. టపాకాయల గోడౌన్ల యజమానులు గోడౌన్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్ని ఉన్నాయా?లేవా అని పరిశీలించారు. దీపావళి దగ్గరపడుతుండడంతో టపాకాయలు కొనుగోలు చేసే వారికి అన్ని జాగ్రత్తలు ఉండాలన్నారు. గోడౌన్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తహశీల్దార్‌తో పాటు డిప్యుటీ తహశీల్దార్ జగన్, సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

ఈఏడాది టపాకాయల దుకాణాలు ఎక్కడ పెడుతారో?

ప్రతి ఏడాది టపాకాయల దుకాణాలుకు అధికారులు ఎక్కడ అనుమతిస్తారో అని దుకాణాల నిర్వాహకులు మదనపడుతున్నారు. ప్రతి ఏడాది ఏరియా ఆస్పత్రి మార్గంలో ఉన్న ఎస్వీఏ బాలుర కళాశాల క్రీడామైదానంలో దుకాణాలు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. ఇక్కడ ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలతో పాటుగ్రామాల నుంచి వచ్చే వారికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. అయితే ఈఏడాది ఎక్కడ పెట్టాలో అధికారుల నుంచి ప్రకటన వెలువడాల్సిన అవసరం ఉంది.

కార్టన్ సెర్చ్‌లో ద్విచక్రవాహనాలు సీజ్

తొట్టంబేడు, అక్టోబర్ 20 ప్రభాతవార్త

తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పీ నరసింహ మూర్తి పర్యవేక్షణలో బిఎన్‌కండ్రిగ సిఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ సిబ్బందితో తొట్టంబేడు పరిధిలోని బీడీకాలనీలో ఆదివారం ఉదయం కార్టన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా అనుమానితులను మరియు వాహనాలను రికార్డులు లేని ద్విచక్రవాహనాలను తనిఖీచేయగా సరిగ్గా లేని ఏడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మరియు సైబర్ క్రైం, డయిల్ 100 గురించి అవగాహన కల్పించారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎస్ఐతో పాటు తొట్టంబేడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

.శ్రీకాళహస్తి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

పట్టణానికి చెందిన చిన్నారి చిట్టత్తూరు ప్రత్యూష శ్రీచైతన్య స్కూల్-2వ బ్రాంచిలో 6వ తరగతి చదువుతోంది. ఈనెల 19న శ్రీనివాస స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన జిల్లా సాయి చదరంగ పోటీల్లో తన ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపల్ రూపాదేవి, పిఈటి మేఘన సహకారంతో రాణించడంతో పాటు అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఉన్నత విద్యతోపాటు క్రీడల్లోను రాణించేలా చేస్తామన్నారు. అంతేకాకుండా చిన్నారి ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో కొత్తపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదరంగ మాస్టర్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటూనే, క్లాసికల్ డ్యాన్స్, కరాటే పోటీలతో పాటు భగవద్గీత, ఐఎన్ఎస్ఓ ఇతర రంగాల్లో రాణిస్తోంది. ఈసందర్భంగా చిన్నారి ప్రత్యూష మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రోత్సహించడంతోనే తాను ముందుకు అన్ని పోటీల్లో పాల్గొంటున్నారని వివరించింది.

రూ.10లక్షలతో సిసిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండలంలోని ముచ్చివోలు గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.10 లక్షలు అంచనాతో గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ డిప్యుటీ సిఎం ఆదేశాలతో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు శ్రీకాళహస్తి మండలానికి రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. దీంతో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామపంచాయతీల్లో ఉన్న గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ప్రజలతో చర్చించి ఆమోదించిన తర్వాతే పనులు మొదలు పెట్టామన్నారు. అనంతరం సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్, సచివాలయ ఇంజనీర్ కుమారి, యూనిట్ ఇన్‌ఛార్జి ఎస్.నరసయ్య, బూత్ ఇన్‌ఛార్జి పుల్లూరు మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు జలగంకృష్ణమనాయుడు, సీనియర్ నాయకులు జలగం సుబ్బారావు, జలగం వెంగళరావు, వెంకటేశ్వర్లు, మాధవనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, పుల్లూరు స్వాతి, ఐటిడిపి ఇన్‌ఛార్జి కేతినేని విజయభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాచైతన్య వేదిక

తొట్టంబేడు, అక్టోబర్ 19 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నేడు తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని ఇందుకు ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఉదయం 9గంటల నుంచి మద్యాహ్నం 1గంట వరకు కార్యక్రమం ఉంటుందని మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందించవచ్చని ఎంపిడిఓ సురేంద్రనాథ్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు తమ నివేదికలతో హాజరవ్వాలని సూచించారు.

15రోజుల లోపు చెల్లిస్తే అదనపు ఛార్జీలు ఉండవు

తొట్టంబేడు, అక్టోబర్ 20 ప్రభాతవార్త

విద్యుత్ బిల్లులు 15రోజుల లోపు చెల్లిస్తే అదనపు ఛార్జీలు ఉండవని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుతశాఖ ఇచ్చిన విద్యుత్ బిల్లు 15రోజుల లోపు బిల్లు చెల్లిస్తే ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవన్నారు. బిల్లు ఇచ్చిన 15రోజుల తర్వాత అదనపు ఛార్జీలు పడుతాయని 30రోజుల లోపల అనగా నెల చివరిలోపు చెల్లిస్తే తర్వాత నెల 1వ తారీకు నుంచి ఎప్పుడైనా నెలాంటి నోటీసు ఇవ్వకఉండా సర్వీసును తొలగిస్తామన్నారు. తొలగించిన విద్యుత్ సర్వీసును సాయంత్రం 5గం.లోపు మాత్రమే పునరుద్ధరించబడుతుందనిసాయంత్రం 5గం.లోపు వచ్చిన వాటికి మరుసటి రోజు వరుసక్రమంలో సర్వీసును పునరుద్ధరించబడుతాయన్నారు. విద్యుత్‌వినియోగదారులు సంస్థకు సహకరించాలని అధికారుల తెలిపారు.

వినాయకుని ఆశీస్సులతో అందరికీ శుభాలు

తిరుపతి,అక్టోబర్ 20ప్రభాతవార్త:

విఘ్నాలకు అధిపతి వినాయకుని పూజించి ఆశీస్సులం దుకుంటే అందరికీ శుభాలు కలుగుతాయని వరసిద్ధి వినా యక మహోత్సవ కమిటీ సభ్యుడు గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. సంకష్టహరచతుర్థశి సందర్భంగా ఆదివారం సాయంత్రం వినాయకసాగర్‌లోని వరసిద్ధివినాయకుని ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. వినాయకునికి చతుర్థశి అత్యంత ప్రీతికరమని, ఈ రోజు స్వామి వారికి అభిషేకాలు చేసి పూలతో అలంకరిస్తే మనోవాంఛ సిద్ధిస్తుందన్నారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు వితరణ చేశారు. ఆలయ పురోహితుడు సురేష్‌స్వామి, ఆలయ ధర్మకర్త కొండేచెంగారెడ్డి,వరసిద్ధివినాయక కమిటీ సభ్యులు గుండాలగోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, శాంతివాసుదేవరెడ్డి, ఆనంద్,మురళి,వాసు తదితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గేదె మృతి

నగరి, అక్టోబరు 20 ప్రభాతవార్త:

మండలంలోని రామాపురం వద్ద రోడ్డు పక్కన నడిచి వస్తున్న రెండు గేదెలను పుత్తూరు వైపుగా వేగంగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందగా మరో గేదెకు తీవ్ర గాయమైంది. మృతి చెందిన గేదె విలువ రూ.40 వేలు ఉంటుందని, మరో గేదెకు పెద్ద ఎత్తున చికిత్స అందించాల్సి ఉందని రైతు ఆవేదనకు లోనయ్యాడు.

టీడీపీ సీనియర్ నాయకుడి మాతృమూర్తి మృతికి నివాళి

విజయపురం, అక్టోబరు 20 ప్రభాతవార్త:

మండలంలోని నారపరాజు కండ్రిగకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవరాజు మాతృమూర్తి సుబ్బమ్మ(80) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి ఆదివారం చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్, చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు దశరథరాజు, లోకేష్‌రాజు, సుధాకర్‌రాజు, అనిల్, వెంకటేష్ యాదవ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బురదమయంగా సిమెంటు రోడ్లు

విజయపురం, అక్టోబరు 20 ప్రభాతవార్త:

మండలంలో సిమెంటు రోడ్లు బురదమయంగా మారింది. తేలికపాటి వర్షం కురిసినా సిమెంటు రోడ్డు పక్కన మురికి కాలువలు లేక పోవడం సిమెంటు రోడ్డుపై మట్టి చేరడం వలన రోడ్డులో మురుగునీరు నిలిచి ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వారం రోజులుగా ప్రతి రోజా వర్షం కురుస్తుండడంతో వీధుల్లో మురుగునీరు చేరుతు న్నదని, దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సిమెంటు రోడ్డుపై నీరు నిలవకుండా మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బలిజ భవన నిర్మాణానికి కృషి చేస్తాం

-ఆంధ్రరాష్ట్ర బలిజ హక్కు సంరక్షణ సమితి వెల్లడి

తిరుపతి విద్య, అక్టోబర్ 20,ప్రభాతవార్త:

స్వర్గీయ తిరుపతి మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ బలిజలకు కేటాయించిన బలిజ భవన్ కు సంబంధించిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు,మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సమక్షంలో అతి త్వరలో భవన్‌కు సంబంధించిన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆంధ్ర రాష్ట్ర బలిజ హక్కు సంరక్షణ సమితి సభ్యులు అడ్వకేట్ శరణకుమార్,యెండమూరి నాగేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానికి డిఆర్ మహల్ రోడ్‌లోని ఆంధ్రరాష్ట్ర బలిజ హక్కు సంరక్షణ సమితి ఆఫీస్ నందు బలిజ సమైక్య మొదటి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బలిజ అభ్యున్నతకై పోరాడుతామని సభ్యులంతా కుడపలికారు అలాగే కార్యాచరణ ఏ విధంగా ఉంటుంది. బలిజుల హక్కు ఏ విధంగా సంరక్షించుకోవాలి అందరికీ అందుబాటులో ఏ విధంగా ఉండాలి వచ్చే సంవత్సర కాలంలో ఆ విధమైన కార్యక్రమాలు ద్వారా మందుకెళ్తాం అనే దాని గురించి వివరించారు.బలిజ భవన్ శంకుస్థాపనకు బలిజ ప్రముఖులని ఆహ్వానిస్తామని తెలిపారు.వి చంద్రమౌళి ఎం హరి రాయల్ పి ఉమాపతి ఎన్ హెచ్ తేజ్ రాయల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మనోహర్ చౌదరి దాత్రృత్వం

తిరుపతిరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ఆపద సమయంలో నేను ఉన్నాను... ప్రభుత్వం నుండి మీకు రావాల్సిన సంక్షేమ సదుపాయాలు కల్పిస్తాను. మీరు అధైర్య పడకండి అని చెప్పి ఆ పూటకు మాయ మాటలు చెప్పి కనుమరుగై నేతలు ఉన్న ఈ రోజుల్లో....నేను ఉన్నాను...మీకు ప్రభుత్వంతో పని లేదు... నాతో ప్రయాణం చేసిన మీ అందరి శ్రేయస్సే నాయ శ్రేయస్సు అని భావించి.... పంచాయతీలో ఎక్కడ ఎమి జరిగిన నేను ఉన్నాను ఉంటూ ప్రజాభిమానాలు చూరగొంటున్న నేత మనోహార్ చౌదరి. గతంలో పార్టీ పేరు చెప్పుకుని స్వప్రయోజనాలు పొందిన నేతలు కంటే అల్టిమేటంగా పార్టీ ప్రయోజనమే ముఖ్యం....అధినాయత్వమేనే శిరోధార్యని భావించి ప్రజాక్షేత్రంలో నిలిచిన అదరుదైన నాయకుడు మనోహర చౌదరి. తిరుపతిరూరల్ మండలం సి.మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం విద్యుత్ షార్ట్ సర్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన విషయం విదితమే. దళితవాడకు చెందిన రామకృష్ణ ఇల్లు పూర్తి దగ్ధం కాగా, దాదాపు 80వేల రుపాయాలు ఖరీదు చేసే వస్తువులు అగ్నికి ఆహుతి అయిన విషయం తెల్సిందే. దళితవాడకు చెందిన రామకృష్ణ లక్ష్మీకాంతమ్మ దంపతులు ఉపాధిహామీ పనికి వెళ్ళగా విద్యుత్ షార్క్‌సర్యూట్ వల్ల ఇంట్లో మంటలు చెలరేగి దాదాపు రూ.80వేల రుపాయాలు విలువ చేసే వస్తులు కాలిబూడిదైన విషయం తెల్సిందే. బాధిత కుటుంబానికి టిడిపి అధ్యక్షుడు మనోహర్ చౌదరి నిత్యవసర వస్తువులు అందజేయడంతో పాటు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందే చూస్తానని తెలిపారు.

పట్టణ అధ్యక్షుని జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్, భారత్ గ్యాస్ అధినేత జి.విజయ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం పార్టీ కార్యకర్తలు,అభిమానుల సారధ్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పార్టీ ని నమ్ముకున్న విజయకుమార్‌కు మంచి భవిష్యత్తు ఉందన్నారు. గత కౌన్సిల్‌లో ఆయనకు సముచిత స్థానం కల్పించుటకు నాన్నగారు ప్రయత్నించారని కానీ వివిధ సమీకరణలతో సాధ్యం కాలేదన్నారు. రాబోవుకాలంలో ఆయనకు మంచి గుర్తింపు ఉంటుందని అభినందించారు.ఈ సందర్భంగా విజయకుమార్‌నాయుడును వేదపండితులు ప్రత్యేకంగా ఆశీర్వదించారు. సన్మానం కార్యక్రమాల్లో పార్టీ నాయకులతో పాటు వ్యాపారస్తులు పొట్టి రాజ,పొట్టి యువ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చివోలులో పవిత్రా రెడ్డి

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో ఆదివారం వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికల తరువాత మొదటి సారి పవిత్రారెడ్డి గ్రామాల్లో కనబడటంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు, గ్రామస్తులు ఆమెను ఆప్యాయతగా పలకరించారు. మాజీ సర్పంచ్ దండి రాఘవయ్య తమ్ముడి కుమారుడు పృద్విరాజ్ కార్యక్రమాలకు ఆమె హాజరయ్యారు. ఆమె తండ్రి బియ్యపు మధుసూధనరెడ్డి ముచ్చివోలులో ప్రత్యేక నిధులతో రామమందిరానికి నిధులు అందించారు.ఈ కార్యక్రమాల్లో జి.శ్రీనివాసులురెడ్డి, పుల్లూరు తిరుమల రెడ్డి,పుల్లూరు గురునాథ్‌రెడ్డి, వయ్యాల మనోహర్‌రెడ్డి,కుక్కా శ్రీనివాసులురెడ్డి,పుల్లూరు శివకుమార్‌రెడ్డి, జె.సురేష్‌రెడ్డి, ఎం.బాలసుబ్రమ ణ్యంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎం.నవీన్ కుమార్‌రెడ్డి, బిల్లు వెంకట్ యాదవ్, ఏ.మురుగయ్య, కె.గురునాథన్‌యాదవ్, ఎం.సురేష్‌రెడ్డి, ముచ్చివోలు నరసింహారెడ్డి, సర్పంచ్ మైలేరు గంగయ్య, ఎం.సుధాకర్,ఎం. జనార్ధన్, ఎం.బాబు, ఎం.వెంకటరామయ్య, ఎం.శేఖరయ్యా, జి.అమర్ నాథ్‌రెడ్డి,కే. సునీల్, వెంకయ్య, బి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, మద్దిల సుధాకర్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

వసతిగృహంలో విద్యార్థుల సమస్యలను తెలుకున్న జడ్జి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుగంగ కాలనీలోని మహిళా ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌ను అడిషనల్ జూని యర్ సివిల్‌జడ్జి కృష్ణప్రియ ఆకస్మికంగా తనిఖీచేశారు. వసతిగృహంలో విద్యార్థినులకు అందిస్తున్న భోజన సదుపాయాలు, మరియు వసతి సదుపాయాలు విద్యార్థినులను మరియు వసతి గృహ వార్డెన్‌ను విచారించారు. హాస్టల్‌లో సరైన వసతులు లేకుండా విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నాని సరైన భోజనం లేదని విద్యార్థినులు న్యాయమూర్తికి తెలిపారు. జిల్లా న్యాయమూర్తి ఆదేశాలతో తాము ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వారం లోపు లోపాలను సరిదిద్దుకోవాలని లేకుంటే శాఖ పరమైన చర్యలుతీసుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, రాజేష్, కృష్ణ, రజనీ, సిందు, టుటౌన్ సిఐ వెంకటేశు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో బదిలీలు

తొట్టంబేడు, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండలంలో ఆర్‌డబ్యుఎస్ ఎఈగా పనిచేస్తున్న మమతా తిరుపతికి బదిలీ కాగా ఆమెస్థానంలో తిరుపతి ఆర్‌డబ్యుఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.గౌరీజోషి బాధ్యతలు స్వీకరించారు. టైపిస్ట్‌గా వడమాలపేట నుంచి విచ్చేసిన ఎం.నళినిజయంతి బాధ్యతలు స్వీకరించగా ఇక్కడ టైపిస్ట్‌గా పనిచేస్తున్న చిరంజీవి దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళారు. ఇక రౌతుసూరమాల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చెంచయ్య శ్రీకాళహస్తి మండలం నారాయణపురంకు బదిలీ కాగా ఆయన స్థానంలో జ్ఞానప్రకాష్, బసవయ్యపాళెంకు మురళీలు బాధ్యతలు స్వీకరించారు.

గోతులు తవ్వేశారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

పాకాల, అక్టోబర్ 20, ప్రభాతవార్త

పాకాల టౌన్, నేంద్రగుంట నుంచి దామలచెరువు మెయిన్ రోడ్డులో నూతన టెలిఫోన్ కేబుల్‌ల కోసం రోడ్డుకు ఒకవైపు అక్కడక్కడ భారీ గోతులు తీసేసి సకాలంలో పూడ్చకుండా వదిలేసారు. వర్షాకాలం అని తెలిపినా ఇంత నిర్లక్ష్యం తగదు అని ప్రజలు అంటున్నారు. ఈ గోతుల వలన నిత్య ప్రజలు, ప్రయాణికులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు మండలంలోని రోడ్డులకు ఆనుకొని ఉన్న ఇలాంటి టెలిఫోన్ కేబుల్‌ల కోసం తవ్విన భారీ గోతులను సత్వరం గుర్తించి వెంటనే పూడ్చి వేయాల్సిందిగా ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

: ఎమ్మెల్యే డాక్టర్ వియం.థామస్

వెదురుకుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని, గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ వియం.థామస్ పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయితీలోగల తెల్లగుండ్లపల్లె హరిజనవాడలో, దేవరగుడిపల్లె పంచాయితీ పరిధిలోని ఆడారెడ్డిపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలోనే గ్రామీణ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలన్నారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాధరెడ్డి, నియోజకవర్గం యువత అధ్యక్షులు ఎన్ఆర్ఐ సమన్వయకర్త గురసాల కిషన్‌చంద్, జిల్లా మాజీ టీడీటీ కార్యదర్శి మోహన్ మురళి,మండల కార్యదర్శి నరసింహయాదవ్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, నాయకులు బట్టే చాణిక్య ప్రతాప్, చంగల్రాయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ సీఎం

వెదురుకుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోని చెంచుగుడి గ్రామంకు చెందిన యర్రసాని కృష్ణారెడ్డి కుమార్తె కావ్యకు వివాహం కావడంతో నూతన దంపతులను మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆశీస్సులు అందజేశారు. చెంచుగుడి గ్రామంకు చేరుకుని నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు ఎంపిపి బండి నాగరాణిహేమసుందర్ రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, మండల వైఎస్ఆర్‌సీపీ ఉపాధ్యక్షులు మరకాలకుప్పం రామయ్య, పెరుమాళ్ళపల్లె ఎంపిటీసీ తోకల మురళి రెడ్డి,వెదురుకుప్పం ఎంపీటీసీ పుత్తూరు రాధికపురంధర్ రెడ్డి, నాయకులు గోవింద రెడ్డి, హరినాథ రెడ్డి, షణ్ముగం రెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల పోర్జరీ కేసులో నిందితుడు అరెస్టు

వెదురుకుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

రెవెన్యూ రికార్డులు పోర్జరీ సంతకాలతో అవకతవకలకు పాల్పడ్డ కేసులో నింధితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు కార్వేటనగరం సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ హనుమంతప్ప, ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.... ఇటీవల మండలంలోని గంటావారిపల్లెకు చెందిన రెవెన్యూ రికార్డులలో, పోర్జరీ సంతకాలకు చేయించి అక్రమాలకు పాల్పడ్డ పుల్లారెడ్డి పై రివెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో పుల్లారెడ్డిని అరెస్టు చే